మల్లన్నసాగర్‌లో మళ్లీ ఎత్తిపోతలు

మల్లన్నసాగర్‌లోకి వస్తున్న గోదారమ్మ

తొగుట, ఆగస్టు 26 : మండలంలోని మల్లన్నసాగర్ ప్రాజెక్టులోకి గోదావరి పరవళ్ల రెండో విడుత మొదలయ్యాయి. సోమవారం తుక్కపూర్ పంప్ హౌస్ నుంచి డీఈ శ్రీనివాస్ ఆదేశాల మేరకు నాలుగు పంపుల ద్వారా ఎత్తిపోస్తున్నారు ఇప్పటికే మల్లన్నసాగర్ 10.10 టీఎంసీల నీళ్లుండగా, మరిన్ని నీళ్ల రానున్నాయి. ఒక్క పంప్ నుంచి 0.1 టీఎంసీ నీటిని విడుదల చేయనున్నారు. ఏడు రోజుల పాటు కొనసాగుతాయని తెలిపారు.

సొంత ఖర్చులతో పారిశుధ్య పనులు

దోమల మందును పిచికారీ చేయిస్తున్న మాజీ సర్పంచ్ చొప్పరి వరలక్ష్మీసాగర్

మద్దూరు (ధూళిమిట్ట), ఆగస్టు 26 : పారిశుధ్య నిర్వహణకు నిధులు లేక గ్రామ పంచాయతీ చేతులెత్తేయడంతో ఆ గ్రామ మాజీ సర్పంచ్ ముందుకొచ్చి సొంత ఖర్చులతో గ్రామంలో పారిశుధ్య పనులు చేయించిన ఘటన ధూళిమిట్ట మండల పరిధిలోని జాలపల్లిలో సోమవారం జరిగింది. గ్రామంలో దోమలు పెరిగిపోవడంతో ప్రజలు డెంగీ తదితర వ్యాధుల బారిన పడుతుండడంతో మాజీ సర్పంచ్ చొప్పరి వరలక్ష్మీసాగర్ రూ.20వేలతో గ్రామంలో గడ్డి మందు, దోమల మందును పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల్లో పరిశుభ్రతను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రజలు రోగాల బారిన పడుతున్న పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో పారిశుధ్య పనులకు ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడం సిగ్గు చేటన్నారు. కార్యక్రమంలో కాశి రాములు, తుపాకుల పెద్దిరాజు, నర్మెట అంజయ్య, సత్యనారాయణగౌడ్, సంపత్, బుచ్చయ్య, కనకయ్య పాల్గొన్నారు.

రుణమాఫీ చేసేంతవరకు పోరాటం ఆగదు

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం మండల కార్యదర్శివెంకట్‌మావో

చేర్యాల, ఆగస్టు 26 : రైతులందరికీ రూ.2లక్షల పంట రుణమాఫీ చేసేంతవరకు కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం ఆగదని సీపీఎం మండల కార్యదర్శి కొంగరి వెంకట్‌మావో, పట్టణ కార్యదర్శి రాళ్లబండి నాగరాజు అన్నారు. సోమవారం చేర్యాల పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో పోలోజు శ్రీహరి అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతుల సమస్యలపై పోరాడుతున్న సీపీఎంను విమర్శించడం తగదన్నారు. సమావేశంలో బోయిని మల్లేశం, రాళ్లబండి భాస్కర్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు బారికేడ్ల ఏర్పాటు

రోడ్డుకు అడ్డంగా బారికేడ్లను ఏర్పాటు చేయిస్తున్న సీఐ శీను

చేర్యాల, ఆగస్టు 26 : చేర్యాల-నర్సాయపల్లి గ్రామాల మధ్య ఉన్న రోడ్డుపై జరుగుతున్న ప్రమాదాల నివారణకు ప్రత్యేకంగా బారికేడ్లను ఏర్పాటు చేసినట్లు చేర్యాల సీఐ ఎల్ శ్రీను అన్నారు. సోమవారం చేర్యాల-నర్సాయపల్లి రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చెట్ల పొదలను తొలిగించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఈ రోడ్డుపై నెల రోజుల వ్యవధిలో జరిగిన ప్రమాదంలో ఇరువురు మృతి చెందినట్లు తెలిపారు. ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బారికేడ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అతివేగంతో ప్రాణాలు పోతాయని, అతివేగంతో వాహనాలు నడుపరాదన్నారు. రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. ఆయన వెంట చేర్యాల ఎస్సై నీరేశ్, కానిస్టేబుళ్లు ఉన్నారు.

కొరవడిన చెత్తశుద్ధి

రోడ్డుపైన పారబోసిన వ్యర్థాలు

రోడ్డుపైన వేసిన చెత్త

- రోడ్లపై పారవేస్తున్న చెత్త
- దుర్వాసన వెదజల్లుతున్న పరిసరాలు
- ఇబ్బందుల్లో స్థానికులు
- పట్టించుకోని అధికారులు, సిబ్బంది

సిద్దిపేట, ఆగస్టు 26 : మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ లోపంతో స్వచ్ఛ పట్టణంగా ఉన్న సిద్దిపేటలో నేడు ఎక్కడ పడితే అక్కడ చెత్త వేస్తుండడంతో దుర్వాసన వెదజల్లుతున్నది. దీంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఇంట్లోని చెత్తను మున్సిపల్ చెత్త సేకరణ వాహనాలకు ఇవ్వకుండా రోడ్లపై పారవేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతాల పరిసరాల్లో దుర్వాసన వస్తుండడంతో రోగాలకు నిలయంగా మారుతున్నది. వీటిని తొలిగించాల్సిన మున్సిపల్ సిబ్బంది పట్టించుకోవడం లేదు. దీంతో రోడ్లపై ఎక్కడి పడితే చెత్త దర్శనమిస్తున్నది. ఇటీవల కురిసిన వర్షాలు, ఈదురు గాలులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పట్టణంలోని చెట్ల కొమ్మలను నరికి వేయించారు. ఈ కొమ్మలను బుస్సాపూర్‌లోని డంప్ యార్డ్‌కు తరలించాల్సిన మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది వాటిని తీసుకొచ్చి పట్టణ శివారులోని బైపాస్ రోడ్డులోని ప్రైవేట్ వ్యక్తులు కొనుగోలు చేసిన స్థలాల్లో వీటిని డంప్ చేస్తున్నారు. పట్టణంలో పాత ఇండ్లను కూలగొట్టిన వ్యర్థాలను తీసుకొచ్చి ఇక్కడ పారవేస్తున్నారు. సిద్దిపేట బైపాస్ రోడ్డు మొత్తం మున్సిపల్ పరిధిలో ఉండటంతో చికెన్ వ్యర్థాలు, పాత బట్టలు, తదితర చెత్తను ఇక్కడ వేసి పోతున్నారు. దీంతో కుక్కలు వాటిని తీసుకొచ్చి రోడ్లపై వేయడంతో పాటు, వాటిని తినేందుకు వచ్చిన కుక్కల బెడదతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

యథేచ్ఛగా చెట్ల నరికివేత

కాలుష్యరహిత పట్టణంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో హరితహారంలో భాగంగా మొక్కలు నాటారు. అవి ఏపుగా పెరగడంతో పచ్చని చెట్లతో పట్టణానికి వచ్చేవారికి రోడ్డుకు ఇరువైపులా ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. విద్యుత్ సరఫరాకు ఇబ్బంది కలుగుతుందనే కారణంతో ఆ చెట్లను నరికి వేయిస్తున్నారు. చెట్ల కొమ్మలను మాత్రమే ట్రిమ్మింగ్ చేయాలనే నిబంధనలు ఉన్నా వాటిని పట్టించుకోవడం లేదు. ఈ విషయమై ఆదివారం పట్టణంలో చెట్లను నరుకుతున్న వారిని చూసి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినా అధికారుల తీరు మారడంలేదని, పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆరుబయట చెత్తను వేస్తే చర్యలు

ఇంట్లోని చెత్తను ఇంటి ముందుకొచ్చే చెత్త సేకరణ వాహనాల్లో వేయాలి. ఆరుబయట, చౌరస్తాలో చెత్తను వేస్తున్న వారిని గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇస్తాం. నిబంధనలను అతిక్రమిస్తే జరిమానాలు విధిస్తాం.

- కడవేర్గు మంజులారాజనర్సు, మున్సిపల్ చైర్‌పర్సన్

నిఘా ఏర్పాటు చేస్తాం

రోడ్డుపై చెత్తను వేయకుండా నిఘా ఏర్పాటు చేస్తాం. గతంలో మాదిరిగా రోడ్ల పక్కన వేసిన చెత్తను తొలిగించడానికి స్పెషల్ డ్రైవ్ చేపట్టాం. నరికివేసిన చెట్ల కొమ్మలు, చెత్తను రోడ్లపై వేస్తే చర్యలు తీసుకుంటాం. చికెన్ సెంటర్ నిర్వాహకులు వ్యర్థాలను వేస్తే చర్యలు తప్పవు.

- ప్రేరణ, మున్సిపల్ కమిషనర్

వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలి

నార్కోటిక్ డ్రగ్స్ టెస్టింగ్‌పై అవగాహన కల్పిస్తున్న ఏసీపీ పురుషోత్తంరెడ్డి, సీఐలు

గజ్వేల్, ఆగస్టు 26: వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని ఏసీపీ పురుషోత్తంరెడ్డి అన్నారు. ప్రతి ఒక్కరూ వాహనాల తనిఖీలో పోలీసులకు సహకరించాలన్నారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని తూప్రాన్ రోడ్డు, ఏసీపీ, ఐవోసీ కార్యాలయాల సమీపంలో వాహనాలను తనిఖీ చేయడంతో పాటు నార్కోటిక్ డ్రగ్స్ టెస్టింగ్‌పై అవగాహన కల్పించారు. 42 వాహనాలపై కేసులు నమోదు, మూడు డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో సీఐలు సైదా, ముత్యంరాజు, ఎస్ఐలుశంకర్, కరుణాకర్‌రెడ్డి, విజయ్‌కుమార్, దామోదర్, చంద్రమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలి

శివారువెంకటాపూర్‌లో గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ మహేందర్‌రెడ్డి

మర్కూక్, ఆగస్టు 26 : ప్రజలు సీసీ కెమెరాల ఏర్పాటుకు పోలీస్ శాఖకు సహకరించాలని రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి అన్నారు. పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు సోమవారం మండలంలోని శివారువెంకటాపూర్ గ్రామాన్ని మర్కూక్ ఎస్సై దామోదర్ పోలీస్ సిబ్బందితో కలిసి సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, సహకరించాలని సూచించారు. యువకులు ఏదైనా మత్తు పదార్థాలు సేవిస్తున్నారని తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్సై దామోదర్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాలు

కుకునూరుపల్లిలో అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న ఆర్యవైశ్య మహిళలు

కొండపాక (కుకునూరుపల్లి), ఆగస్టు 26 : కుకునూరుపల్లిలో శ్రావణమాసాన్ని పురస్కరించుకొని సోమవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ, ముత్యాలమ్మలకు మహిళలు బోనాలు సమర్పించారు. అనంతరం వన భోజనం నిర్వహించారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు కాసం నవీన్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ గంగిశెట్టి పాండురంగం, ఆర్యవైశ్య మహిళలు పాల్గొన్నారు.

వర్గల్‌లో..

వర్గల్, ఆగస్టు 26 : మండల పరిధిలో పోచమ్మ తల్లికి భక్తిశ్రద్ధలతో బోనాలను సమర్పించారు. నెంటూర్‌లో కుమ్మరి శాలీవాహన సంఘం ఆధ్వర్యంలో బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి నైవేద్య సమర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నిమ్మరాంగారెడ్డి, ఉపసర్పంచ్ కొండల్‌గౌడ్, ఎంపీటీసీలు జయరాములు గౌడ్, శ్యామలాసాదుల్లాగౌడ్ పాల్గొన్నారు.

చెరువు శిఖంలో అక్రమ నిర్మాణాలు తొలిగించాలి

చేర్యాల, ఆగస్టు 26 : నాగపురి గ్రామ రెవెన్యూ శివారు కొండ(నల్ల)పోచమ్మ చెరువు శిఖంలో నిర్మించిన అక్రమ కట్టడాలను తొలిగించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ ప్రకటనలో డిమాండ్ చేశారు. నాగపురి రెవెన్యూ పరిధిలోని సర్వే నం బర్ 831లో కొండపోచమ్మ చెరువు 22.02 ఎకరాల విస్తీర్ణంలో ఉందని, దీనికి వందల ఎకరాల్లో ఆయకట్టు ఉందన్నారు. కొండపోచమ్మ చెరువు శిఖంలో అక్రమార్కులు కబ్జా చేసి నిర్మాణాలు చేశారని ఆరోపించారు. పలుమార్లు ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

హుస్నాబాద్‌లో భారీ సమ్మేళనం

సమావేశంలో మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు

హుస్నాబాద్‌టౌన్, ఆగస్టు 26: ఎస్సీ వర్గీకరణ పూర్తయిన తరుణంలో హుస్నాబాద్ నియోజకవర్గంలో వెయ్యి డప్పుళ్లతో భారీ ర్యాలీ సమ్మేళనం నిర్వహించాలని మాదిగ, ఉపకులాలు నాయకులు సోమవారం నిర్ణయించారు. మాదిగల ఆత్మీయ సమ్మేళనం సన్నాహక సమావేశం స్థానిక భారత్ పబ్లిక్ స్కూల్‌లో జరిగింది. కార్యక్రమంలో పలువురు నాయకులు మాట్లాడుతూ 30 ఏండ్ల పోరాటం ఫలించిందని తెలిపారు. ఇందుకు అనుకూలంగా వ్యవహరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ విషయాన్ని గ్రామా గ్రామానా ప్రచారం చేస్తూ నియోజకవర్గ కేంద్రమైన హుస్నాబాద్‌లో భారీ సమ్మేళనం నిర్వహించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి దళిత సంఘాల నాయకుడు ముక్కెర సంపత్ కుమార్ అధ్యక్షత వహించగా ఇన్‌చార్జి బత్తుల చంద్రమౌళి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లింగాల సాయన్న, ఎమ్మార్పీఎస్ నాయకులు ఎనగందుల లక్ష్మీనారాయణ, గాదెపాక రవీందర్, బొజ్జ హరీశ్, అశోక్, సింగరి, వెంకన్న, హరికిషన్, ఎల్లయ్య, సంపత్, రాజమౌళి, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

బాధితుడికి సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్సై అభిలాష్

కోహెడ, ఆగస్టు 26 : మండల పరిధిలోని బస్వాపూర్‌కు చెందిన వరికోలు కృష్ణ తన సెల్ ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. ఈ మేరకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కోహెడ ఎస్సై అభిలాష్ సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఆచూకీ కనుగొని సోమవారం బాధితుడికి అందజేశారు.

జర్నలిస్టు కుటుంబానికి నాయకుల పరామర్శ

తుంగ పవన్‌కుమార్‌ను పరామర్శిస్తున్న మొగుళ్ల రాజిరెడ్డి

మద్దూరు (ధూళిమిట్ట), ఆగస్టు 26 : చేర్యాల సీనియర్ జర్నలిస్టు తుంగ పవన్‌కుమార్, ప్రముఖ వైద్యుడు తుంగ రఘునందన్‌రాణాల తండ్రి రిటైర్డు ఎంఈవో తుంగ రామస్వామి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని సోమవారం పలువురు నాయకులు పరామర్శించారు. పరామర్శించిన వారిలో టీపీసీసీ అధికార ప్రతినిధి మొగుళ్ల రాజిరెడ్డి, మాజీ ఆప్కో చైర్మన్ శ్రీరాములు, చేర్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డి, ప్రముఖ దంత వైద్యుడు ప్రణీత్‌కుమార్‌యాదవ్, బైరాన్‌పల్లి మాజీ సర్పంచ్ బండి శ్రీనివాస్ ఉన్నారు.

వీధి కుక్కల కుటుంబ నియంత్రణకు శ్రీకారం

వీధి కుక్కల తరలింపు వాహనంతో చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న

హుస్నాబాద్‌టౌన్, ఆగస్టు 26 : హుస్నాబాద్ పట్టణంలోని వీధి కుక్కల కుటుంబ నియంత్రణకు మున్సిపల్ పాలకవర్గం సోమవారం సాయంత్రం శ్రీకారం చుట్టింది. సిద్దిపేటకు చెందిన ఏబీసీ కేంద్రంతో ఎంవోయూ చేసుకొని పట్టణంలోని వీధి కుక్కలను సిద్దిపేటకు తరలిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న తెలిపారు. సిద్దిపేటలో స్టెరిలైజేషన్ ఆపరేషన్ చేసి నాలుగు రోజుల తర్వాత మళ్లీ హుస్నాబాద్‌లోనే విడిచి పెట్టడం జరుగుతుందని ఆమె వివరించారు. పలు వీధి కుక్కలను వాహనంలో తరలింపును ఆమె ప్రారంభించారు. అనంతరం పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్లు భాగ్యరెడ్డి, లావణ్య, శ్రీనివాస్, సిబ్బంది సారయ్య, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

బస్వాపూర్‌లో కొండచిలువ కలకలం

హతమైన కొండచిలువతో చంద్రమౌళి

కోహెడ, ఆగస్టు 26 : మండల పరిధిలోని బస్వాపూర్‌లో సోమవారం కొండ చిలువ గ్రామంలోకి వచ్చి కలకలం సృష్టించింది. గ్రామానికి చెందిన మంద చంద్రమౌళి ఇంటి వద్ద కనిపించడంతో పిల్లలతో పాటు పెద్దలు భయాందోళనకు గురయ్యారు. స్థానికుల సాయంతో కొండ చిలువను హతమార్చగా గ్రామ శివారులో చెట్లు ఉండడంతో తరచూ పాములు వస్తున్నాయని గ్రామస్తులు తెలిపారు.

మంద కృష్ణ వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహులు

సిద్దిపేట టౌన్, ఆగస్టు 26 : 'మాల మేదావులందరూ మనువాదులే' అని మందకృష్ణ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా కన్వీనర్ నర్సింహులు అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మాలలందరూ ఐక్య పోరాటాలు చేస్తుంటే మందకృష్ణ మాదిగ తట్టుకోలేక మతిభ్రమించి మాట్లాడుతున్నారన్నారు. మాలల ఆత్మగౌరవాన్ని తగ్గించి మాట్లాడితే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో శ్రీరాములు, శ్రీనివాస్, కొదాది శ్రీనివాస్, సత్తయ్య, నర్సింగ్ రావు, సత్యనారాయణ, ఎల్లేశ్, దారస్వామి, రాజేందర్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో నడవాలి

మాట్లాడుతున్న ఏసీపీ మధు

సిద్దిపేట టౌన్, ఆగస్టు 26 : యువత సన్మార్గంలో నడిచి ఉత్తమ పౌరులుగా ఎదగాలని సిద్దిపేట ఏసీపీ మధు ఆకాంక్షించారు. సిద్దిపేట వన్ టౌన్, టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం కార్డెన్ సర్చ్‌ను పోలీసులు నిర్వహించారు. ఈ సందర్భంగా 17 వాహనాలను సీజ్ చేశారు. ప్రభుత్వ నిషేధిత గుట్కాప్యాకెట్లను సీజ్ చేశారు. బెల్ట్ దుకాణాన్ని రైడ్ చేసి లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నారు. అంతకుముందు నార్కోటిక్స్ డాగ్స్ అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీ చేశారు. అనంతరం టోల్ ఫ్రీ నెంబర్ 1930, డయల్ 100 తదితర వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐలు లక్ష్మీబాబు, ఉపేందర్, విద్యాసాగర్, శ్రీనివాస్, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వాల్మీకి స్కామ్‌పై విచారణ జరపాలి

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 26: వాల్మీకి స్కామ్‌పై విచారణ జరిపించి నిధుల మళ్లింపు వ్యవహారంలో తెలంగాణకు న్యాయం జరిగేలా చూడాలని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రావణ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాల్మీకి స్కామ్‌ను పక్కదోవ పట్టించడానికి హైడ్రా పేరిట కొత్త వివాదానికి తెరలేపారన్నారు. కర్ణాటకలో జరిగిన స్కామ్‌లో తెలంగాణ కాంగ్రెస్ నాయకుల పాత్ర కీలకంగా ఉందని ఆరోపించారు. ఇప్పటికైనా పూర్తి విచారణ జరిపి తెలంగాణకు న్యాయం జరిగేలా చూడాలన్నారు.

చైతన్య పర్చిన కనువిప్పు

సిద్దిపేట టౌన్, ఆగస్టు 26 : సిద్దిపేట వన్ టౌన్ పరిధిలోని గాంధీ నగర్ చౌరస్తాలో సోమవారం నిర్వహించిన పోలీస్ కళాబృందం నిర్వహించిన కనువిప్పు ప్రజలను చైతన్య పరిచింది. ఈ సందర్భంగా ఎస్సై కనకయ్యగౌడ్ మాట్లాడుతూ.. గంజాయి మత్తు పదార్థాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, కళాకారులు పాల్గొన్నారు.

జ్యూట్ బ్యాగ్ తయారీపై అవగాహన

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 26 : మండల పరిధిలోని మిట్టపల్లిలో సోమవారం జ్యూట్ బ్యాగుల తయారీపై అవగాహన కల్పించారు. ఈ మేరకు జ్యూట్ లంచ్ బ్యాగ్, పౌట్, పోల్డర్, లగేజ్, లాప్‌టాప్ బ్యాగుల తయారీపై గ్రామస్తులకు వివరించినట్లు నిర్వాహకులు తెలిపారు. జ్యూట్ బ్యాగులతో కలిగే లాభాలపై అవగాహన కల్పించినట్లు వారు తెలిపారు. అనంతరం శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు.

కారు ఢీ.. విద్యార్థికి గాయాలు

నారాయణరావుపేట, ఆగస్టు 26 : కారు ఢీకొని గురుకుల విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని గుర్రాలగొందిలో సోమవారం జరిగింది. గ్రామంలోని ఎస్సీ గురుకుల పాఠశాలలో సీనియర్ ఇంటర్ విద్యార్థి మనోజ్ కుమార్ (16) నారాయణరావుపేట నుంచి హాస్టల్‌కు వెళ్తున్న క్రమంలో గుర్తు తెలియని కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

గౌహతి షాపునకు మన ఉపాధ్యాయుడు

రాజమల్లు ఉపాధ్యాయుడు

హుస్నాబాద్ టౌన్, ఆగస్టు 26 : చారిత్రక, సాంస్కృతిక వారసత్వ సంరక్షణలో పాఠశాలల పాత్రపై అస్సాం రాష్ట్రంలోని గౌహతిలో నిర్వహించే వర్క్ షాపునకు హుస్నాబాద్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన అంగ్ల ఉపాధ్యాయుడు పంజా రాజమల్లు హాజరవుతున్నారు. (సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్సెస్ అండ్ ట్రైనింగ్) సాంస్కృతిక వనరులు, శిక్షణా కేంద్రం న్యూఢిల్లీ ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి సెప్టెంబర్ 5వరకు గౌహతిలో వర్క్‌షాపు నిర్వహించనున్నారు. ఈ వర్క్‌షాపునకు దేశంలోని పలు రాష్ట్రాల నుంచి ఉపాధ్యాయులు హాజరుపుతున్నారు. హుస్నాబాద్ నుంచి గౌహతికి పంజా రాజమల్లు ఎంపిక కావడపై ఎస్సీఈఆర్‌టీ డైరెక్టర్ గాజుల రమేశ్, డీఈవో శ్రీనివాసరెడ్డి, సెక్టోరల్ ఇన్‌చార్జి భాస్కర్, ఎంఈవో వాసుదేవరెడ్డి, హుస్నాబాద్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కాయిత వాసుదేవరెడ్డి, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

ఇంటింటా జ్వరం సర్వే

వర్గల్‌లో జ్వరం సర్వే చేస్తున్న ఆశ వర్కర్లు

వర్గల్, ఆగస్టు 26 : మండల పరిధిలోని గ్రామాల్లో వైద్య సిబ్బంది సోమవారం ఇంటింటికీ తిరిగి జ్వరం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమలు, తోకపురుగులు పెరగకుండా, నీటి నిల్వ కేంద్రాలను తొలిగించుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు, ఆశ వర్కర్లు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

మర్కూక్, ఆగస్టు 26 : మండల పరిధిలోని పాములపర్తికి చెందిన వడ్ల వెంకటేశ్ అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీ పాండుగౌడ్ సోమవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు పిట్లస త్యనారాయణ, కరుణాకర్ ఉన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

కోహెడ, ఆగస్టు 26 : అప్పుల బాధ భరించలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండల పరిధిలోని విజపల్లిలో ఆదివారం జరిగింది. ఎస్సై అభిలాష్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన నంగునూరి తిరుపతి (40) చికెన్ సెంటర్‌లో పని చేస్తున్నాడు. ఆదివారం పొలానికి వెళ్లి వస్తానని తిరిగి రాలేదు. దీంతో పొలం వద్ద వెళ్లి చూడగా క్రిమి సంహారక మందు తాగి మృతి చెందినట్లు గుర్తించారు. వైద్య ఖర్చులు, దుబాయి వెళ్లేందుకు అప్పులు చేశాడు. అప్పులు తీర్చే మార్గం లేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య భవాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

మర్కూక్, ఆగస్టు 26 : మర్కూక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నర్సన్నపేట శివారులో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. సోమవారం గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై దామోదర్ సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. యాదాద్రి జిల్లా రాజపేట మండల పరిధిలోని పుట్టగూడెం గ్రామానికి చెందిన మాలోతు నవీన్ లాంటి అనుమతి లేకుండా తరలిస్తున్న 38 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకొని సీజ్ చేశామని సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై దామోదర్,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కోహెడ నుంచి సిద్దిపేటకు బస్సు సౌకర్యం కల్పించాలి

కోహెడ, ఆగస్టు 26 : కోహెడ నుంచి సిద్దిపేటకు బస్సు సౌకర్యం కల్పించాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు భీంరెడ్డి రాజిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అంతకుముందు హుస్నాబాద్ నుంచి కోహెడ, గుండారెడ్డిపల్లి మీదుగా హైదరాబాద్ వెళ్లే బస్సు ఉండేదన్నారు. ఆ బస్సును నిలిపివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ రెండు బస్సులను వెంటనే ప్రారంభించాలని కోరారు.

గురుకులంలో స్పాట్ అడ్మిషన్లు

నారాయణరావుపేట, ఆగస్టు 26 : తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల చిన్నకోడూర్, గుర్రాలగొంది కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో మిగిలిన సీట్ల కోసం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తునట్లు ప్రిన్సిపాల్ దుర్గారెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు సంబంధిత ధ్రువపత్రాలతో ఆగస్టు 27 ఉదయం 9 గంటల్లోపు కళాశాలలో హాజరు కావాలని కోరారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియో